పైరవీలు!



- కోరుకున్న చోటు కోసం సిఫార్సు లేఖలతో తహసీల్దార్లు
- నేడే, రేపో పోస్టింగ్ ఉత్తర్వులు
- చర్చిస్తున్న నాలుగు జిల్లాల కలెక్టర్లు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6: కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ పొందడానికి తహసీల్దార్లు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రజా ప్రతినిధుల నుంచి పొందిన సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారుల వద్దకు వెళ్తున్నట్టు సమాచారం. రూల్స్‌ను అతిక్రమించి ఫోకల్ పోస్టులో కొలువులు పొందేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 20 మంది తహసీల్దార్లను ఇటీవల రిలీవ్ చేశారు. దీంతో వారందరూ ఇతర జిల్లాల్లో కలెక్టర్లకు రిపోర్టు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో రిపోర్టు చేశారు. ఇలా వచ్చిన వారిలో 17 మంది ఉన్నారు. మరొక తహసీల్దార్ కలెక్టరేట్‌లో ఒక విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్నారు. దీంతో రెండు మండలాల్లో తహసీల్దార్ల కొరత ఉంది. ఆ రెండుచోట్లా డిప్యూటీ తహసీల్దార్లనే ఇన్‌చార్జిలుగా నియమించే అవకాశాలున్నాయి. జిల్లాలో ఎక్కువగా డిమాండ్ ఉన్న ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, కాకినాడ రూరల్, తాళ్లరేవు, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో పోస్టింగ్ కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ట్టు తెలిసింది. ఎందుకంటే ఆయా మండలాల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది. రొయ్యల చెరువులు, గ్రావెల్ వంటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను పొంది తాము కోరుకున్న పోస్టింగ్ ఇప్పించుకునేందుకు పైరవీలు సాగిస్తున్నట్టు సమాచారం. తొండంగి, యు.కొత్తపల్లి, కాజులూరు, పెదపూడి, కరప మండలాలకు డిమాండ్ తక్కువగా ఉంది. ఇక్కడకు వెళ్లడానికి చాలా మంది అంతగా ఆసక్తి కనబరచట్లేదు.

తహసీల్దార్లకు సొంత నియోజకవర్గంలో గానీ, సొంత రెవెన్యూ డివిజన్‌లో గానీ పోస్టింగ్ ఇవ్వద్దని ప్రభుత్వం ఉత్తర్వుల్లో నిబంధన పెట్టింది. దీంతో వారంతా ఆ దిశగా ప్రయత్నాలు చేసే అవకాశం లేదు.

తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చే విషయంపై నాలుగు జిల్లాల కలెక్టర్లు చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు దీనిపై కసరత్తు చేస్తున్నారు. సీనియారిటీ, ప్రతిభను అనుసరించి ఎక్కడ నియమించాలనే అంశంపై సమీక్షిస్తున్నారు. సీసీఎల్ఏ కమిటీలో ఉన్న ఈ నలుగురు కలెక్టర్లు తహసీల్దార్ల పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారు. అలాగే ఏజెన్సీ పరిధిలోని రంపచోడవరం నియోజకవర్గంలో 11 మండలాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడ జిల్లా కలెక్టర్ ద్వారా వీరికి కూడా పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

జిల్లాలోని మండలాల్లో ఎవరిని ఎక్కడ నియమించాలనే అంశంపై కసరత్తు పూర్తయినట్టు కలెక్టరేట్ వర్గాలు చెప్తున్నాయి. బుధ, గురువారాల్లో పోస్టింగ్ ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నట్టు తెలిసింది. సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకుని పోస్టింగ్ ఇస్తారో లేదో అన్న దానిపై సస్పెన్స్ నెలకొంది.

నిజాయితీగా పనిచేసిన ట్రాక్ రికార్డు ఉన్న తహసీల్దార్లను తమ మండలాల్లో నియమించాలని పలువురు ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులను కోరుతున్నట్టు సమాచారం. రెవెన్యూ, ల్యాండ్ అండ్ రికార్డు, ప్రభుత్వ పథకాల మంజూ రులో కీలకపాత్ర పోషించే వీరు నిజాయితీపరులైతే తమ నియోజకవర్గాలకు మంచి పేరు వస్తుందని ఆయా ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు.

ష్... గప్ చుప్



అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ పరాజయం తర్వాత జిల్లాలో ప్రతిపక్ష వైసీపీ పరిస్థితి అత్యంత ఘోరంగా మారింది. ఎక్కడా నియోజకవర్గాల్లో ఉనికే లేకుండా పోయింది. ఒకరకంగా చెప్పాలంటే అస్తిత్వం కోల్పోయినట్లయింది. నేతలు ఎక్కడా ఉలుకూ పలుకు లేకుండా గప్‌చుప్ అయిపోయారు. పార్టీని నమ్ముకుంటే రాజకీయ భవిష్యత్తు ఉండదన్న లెక్కలతో దూరంగా ఉంటున్నారు. కొందరైతే పార్టీకి బైబై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఓటమి తర్వాత కూడా తమ అధినేత జగన్ పద్ధతి ఏమాత్రం మారకపోవడంతో పార్టీకి మనుగడ కష్టమేనన్న అంచనాలతో దూరంగా ఉంటున్నారు. చివరకు ఈ ఐదేళ్లపాటు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఇస్తాం తీసుకోండంటూ అధిష్ఠానం వెంటపడుతుంటే అయ్య బాబోయ్ అంటూ నేతలు పారిపోతున్నారు. మరోపక్క పిఠాపురంలో వైసీపీకి మాజీ ఎమ్మెల్యే దొరబాబు షాక్ ఇచ్చారు. రేపోమాపో పార్టీకి రాంరాం చెప్పేయనున్నారు. ఇతర నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలైతే అంతా సైలెంట్ అయిపోగా, ద్వితీయ శ్రేణి నేతలు జంప్ అయిపోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే మొన్నటివరకు చేతిలో అధికారం ఉండడంతో జిల్లాలో విచ్చలవిడిగా చెలరేగిపోయిన వైసీపీ తీరా అధికారం పోవడంతో ఏకంగా ఉనికే ప్రశ్నార్థకంగా మారే దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

- అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత జిల్లాలో వైసీపీ ఆచూకీ గల్లంతు
- ప్రజాక్షేత్రంలో ఎక్కడా కనిపించని మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు
- కేడర్‌కు సైతం ముఖం చూపించకుండా కేరాఫ్ ఇళ్లు... లేదంటే హైదరాబాద్
- పార్టీలో కొనసాగితే భవిష్యత్తు ఉండదనే లెక్కలతో ఎవరికి వారే జారుకుంటున్న వైనం
- జిల్లా పార్టీ అధ్యక్ష పదవి తీసుకోవడానికి ఒక్కరంటే ఒక్కరూ ముందుకు రాని దుస్థితి
- అటు పిఠాపురంలో వైసీపీకి మాజీ ఎమ్మెల్యే దొరబాబు షాక్: రేపోమాపో రాజీనామా
- అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడం, జగన్ వైఖరితో విసుగెత్తిపోయిన వైనం
- ఇప్పటికే ఓటమి తర్వాత పత్తాలేని కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్
- మాజీ మంత్రులు దాడిశెట్టి రాజా, కన్నబాబు సొంత వ్యవహారాల్లో తలమునకలు
- నియోజకవర్గాలు, మండలాల్లో పార్టీని వీడడానికి భారీగా సిద్ధమవుతున్న క్యాడర్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన వైసీపీ తీరా ఫలితాల్లో బోర్లాపడ్డంతో జిల్లాలో ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. ఫలితాలు వెలువడి దాదాపు మూడు నెలలు దాటుతోంది. అయితే ఇంతవరకు ఆ పార్టీ నేతల ఆచూకీ కనిపించట్లేదు. ఘోరమైన ఓటమి చవిచూసిన వైసీపీ ఎమ్మెల్యేలు ఆ షాక్ నుంచి బయటపడలేక రోడ్డెక్కడానికి సైతం జంకుతున్నారు. అధికారం ఉన్నన్నాళ్లు కనిపించిన కొండను, గుట్టను మింగేయడం దగ్గర నుంచి కబ్జాలు, దౌర్జన్యాలతో చెలరేగిపోయారు. అటు జగన్ ప్రభుత్వం సైతం నియంత పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది. ఇవన్నీ కలగలసి ఎక్కడికక్కడ వైసీపీ తరపున పోటీ చేసిన వాళ్లంతా జిల్లాలో చిత్తుచిత్తుగా ఓడిపోయారు. అయితే ఇప్పటికీ వారు బయటకు రావడం కాదు కదా సొంత పార్టీ క్యాడర్‌ను సైతం కలవట్లేదు. అటు పార్టీ కార్యక్రమాల జోలికి కూడా వెళ్లట్లేదు. జగన్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ధర్నాకు జిల్లా నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా దాదాపుగా వెళ్లలేదు. ప్రధానంగా అధికారంలో ఉన్నప్పుడు జగన్ తమను కనీసం పట్టించుకోకపోవడం, అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా హీనంగా చూసిన రోజులను గుర్తుకు తెచ్చుకుని వీరంతా రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆ కసితో ఓటమి తర్వాత వీరంతా పార్టీ కాడి ఎత్తేశారు. దీంతో పరాజయం తర్వాత జిల్లాలో వైసీపీ ఉనికే లేకుండా పోయింది. ప్రధానంగా తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఓటమి తర్వాత తన బంగారం వ్యాపారానికే పరిమితమయ్యారు. రోజంతా సొంత దుకాణంలో కూర్చుంటున్నారు. క్యాడర్‌ను కూడా పెద్దగా కలవట్లేదు. ప్రత్తిపాడు అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన వరుపుల సుబ్బారావు ఫలితాల తర్వాత అనారోగ్యం బారిన పడ్డారు. క్యాడర్‌ను కూడా కలవడం లేదు. జగ్గంపేటలో మాజీ మంత్రి తోట నరసింహం తనకు చివరి అవకాశం అని ఓట్లు అడిగినా జనం కనికరించలేదు. దీంతో తీవ్ర షాక్‌లో ఉన్నారు. పెద్దాపురం నుంచి ఓటమిపాలైన దవులూరి దొరబాబు అయితే ఇల్లు... లేదంటే హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. మరో మాజీ మంత్రి కన్నబాబు సైతం ఇంటి నుంచి బయటకు రావడం లేదు. అప్పుడప్పుడు పార్టీ కార్యకర్తల వద్దకు పరామర్శలకు వెళ్లడం మినహా స్తబ్దుగా మారారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి పరిస్థితి మరీ దారుణంగా మారింది. అధికారంలో ఉన్నన్నాళ్లు చేయని అవినీతి, అక్రమాలు, దందాలంటూ లేవు. ఇప్పుడవన్నీ ఒక్కోటీ బద్ధలవుతుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చివరకు తనకు భద్రత కావాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలా ఎవరికివారే ఓటమి తర్వాత నీరుగారిపోయి వైసీపీలో రాజకీయ భవిష్యత్తుపై ఆశలు లేక బేలగా మారారు. కాకినాడ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి నాలుగోసారీ ఓడిపోయిన చలమశెట్టి సునీల్ ఫలితాల తర్వాత మాయమైపోయారు.



ఉండలేం...వదిలేద్దాం..

ఎన్నికల్లో కనివినీ ఎరుగని దారుణ ఓటమితో ఇక వైసీపీకి రాజకీయ భవిష్యత్తు కష్టమేనన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి కేసుల్లో జగన్ ఏక్షణమైనా జైలుకు వెళ్లాల్సిన పరిస్థితులు, ఓటమి తర్వాత కూడా అధినేతలో ఏమార్పు లేకుండా ఇప్పటికీ నిరంకుశంగానే వ్యవహరిస్తుండడంతో పార్టీలో ఇమడలేక అనేకమంది మాజీ ఎమ్మెల్యేలు, నేతలు పార్టీని వీడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. టీడీపీ, జనసేనల్లో ఖాళీలు లేకపోవడం, వైసీపీ నుంచి వచ్చేవారి విషయంలో ఈ రెండు పార్టీలు ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటుండడంతో బతిమాలైనా సరే వాటిల్లో చేరడానికి వైసీపీ నేతలు చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వైసీపీకి షాక్ ఇచ్చారు. రేపోమాపో జనసేనలో చేరడానికి ఆయన సిద్ధంగా వున్నారు. ఆయనతో పాటు నియోజకవర్గంలోని కీలక నేతలంతా రాజీనామాల బాట పట్టబోతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన తనకు ఎన్నికల్లో సీటు ఇవ్వకుండా అవమానించడం, ఎన్నికలకు ముందు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఇస్తానని మాట తప్పడంతో జగన్ వైఖరిపై దొరబాబు విసిగిపోయారు. దీంతో పార్టీకి టాటా చెప్పేందుకు నిర్ణయించుకున్నారు. ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లో అనేక మంది కీలక నేతలు, క్యాడర్ రాజీనామా చేయనున్నారు. వైసీపీలో ఉంటే రాజకీయ భవిష్యత్తు ఉండదనే కారణం, ఇన్‌చార్జిల పరిస్థితి కూడా హీనంగా మారడంతో పార్టీకి వీడ్కోలు చెప్పడానికి సిద్ధమవుతున్నారు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీలో అసలు ఎవరుంటారో కూడా అర్థంకాక వైసీపీ తలపట్టుకుంటోంది. అటు పార్టీ మారడానికి అసలేమాత్రం ఛాన్స్ లేని మాజీ ఎమ్మెల్యేలు కొందరు మళ్లీ వచ్చే ఎన్నికలకు చూద్దాం... అప్పటివరకు వైసీపీకి దూరంగా ఉంటేనే మంచిదనే భావనలో ఉన్నారు. వెరసి జిల్లాలో ఉనికి కోల్పోయే పరిస్థితిలో వైసీపీ వుంది.

అన్నవరం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

అన్నవరం, ఆగస్టు 6: అన్నవరం దేవస్థానంలో పలువురు దిగువ స్థాయి సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీచేశారు. సూపరిం టెండెంట్ క్యాడర్‌లో వున్న అనకాపల్లి ప్రసాద్‌ను పరిపాలనా విభాగానికి మార్చారు. బలువు సత్యశ్రీనివాస్‌కు సెంట్రల్ స్టోర్స్, ఆడిట్ విభాగాలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో శాంతి మూర్తిని సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి, పెన్నాడ వెంకటేశ్వరరావును లీజుల విభాగానికి మార్చారు. వీరితో పాటు మరో 103 మంది చిన్న ఉద్యోగులకు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం నుంచి వేరేచోటకు స్థానచలనం కల్పించారు.

వైభవంగా సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు

....వివరాలు 7లో



వీసీ మురళీకృష్ణతో ఇన్‌చార్జి డైరెక్టరు, అధికారులు

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు

ఆర్ఐసీ ఇన్‌చార్జి డైరెక్టరుగా ప్రొఫెసర్ గోపాలకృష్ణ

జేఎన్టీయూకే, ఆగస్టు 6: ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జేఎన్టీయూకేలోని పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్‌కు, డాక్టర్ కె.రాము ఐఎస్టీకి, ఏఎస్ఎన్ చక్రవర్తి ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగానికి ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమితుల య్యారు. యూసీఈకే మెకానికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.లక్ష్మణ్ కిషోర్‌ను కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి ఇన్‌చార్జి విభాగాధిపతిగాను, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణభాస్కర్‌ను పెట్రోలియం ఇంజనీరింగ్ ఇన్‌చార్జి విభాగాధిపతిగాను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టరేట్ ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్, స్టార్టప్, పేటెంట్స్ పొందేం దుకు రీసెర్చ్ స్కాలర్‌లకు, విద్యార్థులకు మార్గదర్శనం చేస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటుచేసిన ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టరేట్ ద్వారా సర్వర్‌లు, స్టోరేజ్ సిస్టమ్, నెట్‌వర్కింగ్, ఆపరేటింగ్ సిస్టమ్, డేటాబేస్, ఇతర అప్లికేషన్‌లను బలోపేతం చేస్తామన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమితులైన వారిని వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అభినందించారు.

రోడ్డెక్కిన జగనన్న కాలనీవాసులు

గొల్లప్రోలులో ధర్నా, రాస్తారోకో

రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని ఆవేదన

గొల్లప్రోలు, ఆగస్టు 6: సుద్దగడ్డ వరద నీటితో సతమతమవుతున్న జగనన్న కాలనీవాసులు రోడ్డెక్కారు. తమ ఇబ్బందులను పరిష్కరించాలంటూ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుద్దగడ్డ వరద నీరు చేరడంతో ఆరు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయని, తాగునీరు, ఆహారం లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందంటూ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఆరురోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు ఎవ్వరు తమను పట్టించుకోలేదంటూ అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సుద్దగ డ్డ (కొండ)కాలువ వద్ద ధర్నాకు దిగారు. అక్కడి నుంచి ప్రదర్శనగా జాతీయ రహదారికి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ధర్నా, రాస్తారోకో జరిపారు. ముంపు బాధి తులకు తాగునీరు, ఆహారం అందించాలని, రాకపోకలకు వీలుగా వంతెన నిర్మాణం చేపట్టాలని నినాదాలు చేశారు. ఉన్నతాధికారులు ఎవ్వరూ వచ్చి తమ కష్టాలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు స్పందించి కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, శంకర్, కొశిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



యాప్ తొలగింపుతో టీచర్లు హ్యాపీ



- గురువులకు తప్పిన మరుగుదొడ్ల బాధ
- గతంలో ఆత్మాభిమానాన్ని హరించిన వైసీపీ ప్రభుత్వం
- ఆయాలు రాకపోతే ఉపాధ్యాయులే శుభ్రపర్చాల్సి వచ్చేది
- యాప్‌లో టికెట్ రైజైతే క్లోజ్ చేసే బాధ్యతా వారిదే
- పాఠశాలలో తొలి దర్శనం మరుగుదొడ్డే
- సిగ్నల్ లేక ఫోటోలు అప్‌లోడ్ కాకపోయినా టీచర్లదే భాధ్యత
- ఆకస్మిక తనిఖీల్లోనూ మరుగుదొడ్డిదే ప్రధాన పాత్ర
- యాప్‌లో టీఎంఎఫ్ టైల్ తొలగించిన కూటమి ప్రభుత్వం
- ఉపాధ్యాయుల హర్షాతిరేకాలు

తొండంగి, ఆగస్టు 6: పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరంతరం స్మరించే పేరేదైనా ఉందంటే అది మరుగుదొడ్డే. గత వైసీపీ ప్రభుత్వంలో నిత్యం ఆ నామ జపమే జరిగేది. మరుగు దొడ్లు శుభ్రంగా లేకపోతే ఉపాధ్యాయులు చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని అధికారులు సమావేశాల్లోను, వెబెక్స్‌ల్లోను ఎప్పుడూ హెచ్చరికలే ఉండేవి. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యేవారు. రాష్ట్ర స్థాయి అధికారుల పర్యటనల్లోనూ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండడంతో దిగువ స్థాయి అధికారులూ దానిపైనే దృష్టిసారించేవారు. వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసింది. అందులో భాగంగా మరుగుదొడ్లలో సౌకర్యాలు కల్పించారు. 2021 ఏప్రిల్‌లో ఐఎంఎంఎస్ యాప్ ప్రవేశపెట్టి.. అందులో టాయిలెట్ ఫొటో లను ఉదయం అప్‌లోడ్ చేయాలని షరతు విధించారు. ఫ్లోరింగ్, వాష్‌బే సిన్, బాలురు, బాలికల మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. అప్ప టికే ఆయా చేత శుభ్రపరిచి ఉన్న టాయిలెట్ ఫొటోలు అప్‌లోడ్ చేద్దామ నుకుంటే ఏదైనా విద్యార్థి అప్పుడే టాయిలెట్‌కు వెళ్తే పని మళ్లీ మొదటికి వచ్చేది. తిరిగి శుభ్రం చేయించి ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. ఏమాత్రం ఆలస్యమైనా వెంటనే ఉన్నతాధికారుల నుంచి ఫోన్లు, హెచ్చరి కలు షరా మామూలే. ఫొటోలు అప్‌లోడ్ చేయడం పెద్ద ప్రహసనంగా మారేది. సిగ్నల్ లేక ఆలస్యమైతే అధికారుల ఒత్తిడి, సంజాయిషీలతో సతమతమవ్వాల్సి వచ్చేది. తీరా ఫొటోలు సక్రమంగా అప్‌లోడ్ అయ్యి ఎక్కడైనా సరిగా శుభ్రపరచనిది క్యాప్చరైతే యాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వలన టికెట్ రైజ్ అయ్యి అది తనిఖీ అధికారుల లాగిన్‌కు చేరేది. దీంతో అర్జంటుగా టికెట్ క్లోజ్ చేయాలని... అది ఉన్నతాధి కారులకు, సీఎం డేష్‌బోర్డుకు చేరే అవకాశం ఉన్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించేవారు .దీంతో అప్పటికప్పుడు వాటిని శుభ్రపరిచి తిరిగి ఫోటోలు అప్‌లోడ్ చేసి టికెట్ క్లోజ్ చేయాల్సి వచ్చేది. ఇటువంటి సమయంలో ఏదైనా కారణాలతో ఆయా సెలవు పెడితే ఉపాధ్యాయులే వాటిని శుభ్రపరచాల్సి వచ్చేది. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు కూడా వీటిని పర్యవేక్షించి టికెట్ రైజ్ చేయడంతో వాటిని కూడా ఉపాధ్యాయులే క్లోజ్ చేయాల్సి వచ్చేది.

మండల స్థాయి అధికారులు మొదలుకుని ఎవరు వచ్చినా టాయిలె ట్లను పరిశీలించడం పరిపాటిగా మారింది. రాష్ట్ర స్థాయి అధికారి ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఉపాధ్యాయుల ఆత్మాభిమానం దెబ్బతినే వి ధంగా హెచ్చరికలు చేయడంతో జిల్లాస్థాయి అధికారులు కూడా దీనిపైనే ఎక్కువ ఫోకస్ పెట్టాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు బోధనకు దూరమై మరుగుదొడ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని అప్పటి వైసీపీ ప్రభుత్వం కల్పించింది. అత్యంత పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని అత్యంత దయనీయమైన స్థాయికి దిగజార్చిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానిదే. ఉపాధ్యాయులు బోధన పక్క నబెట్టి మరుగుదొడ్లను శుభ్రం చేయించి వాటి అందాలను కాపాడాల్సిన స్థితికి చేరాల్సి వచ్చింది. అనేక పాఠశాలల్లో రాత్రి కాపలాదారులు లేకపోవడంతో గ్రామస్తులు ఇష్టం వచ్చిన రీతిలో మరుగుదొడ్ల తాళాలు పగలగొట్టి కుళాయిలు విరగ్గొట్టి చిందరవందర చేసినా ఉదయమే ప్రధానోపా ధ్యాయులు వాటిని సరిచేయించాల్సిన పరి స్థితి పాఠశాలల్లో నెలకొంది. నిరంతరం వీటిపైనే దృష్టి కేంద్రీకరించాల్సి రావడంతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవ్వాల్సి వచ్చింది.

పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు ప్రార్థనతో రోజును ప్రారంభించాల్సి ఉండగా మరుగుదొడ్డి దర్శనంతో ప్రారంభించాల్సిన దుస్థితి వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు కల్పించింది. అనేక ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు మరుగుదొడ్ల భారం నుంచి ఉపాధ్యాయులను దూరం పెట్టాలని సూచించినా వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించి మరింతగా భారం పెంచు కుంటూ పోయింది. ఉపాధ్యాయుల విన్నపా లను పెడచెవిన పెట్టి వారి ఆత్మాభిమానాన్ని గాయపరిచింది.

ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ఐఎంఎంఎస్ యాప్‌లో టీఎంఎఫ్ టైల్‌ను కూటమి ప్రభుత్వం తొలగించింది. మరుగు దొడ్ల ఫొటోలను ఉపాధ్యాయులు తీయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతు న్నాయి. ఇకపై తమ పూర్తి సమయం బోధ నకు కేటాయించవచ్చంటున్నారు. ఆత్మాభిమా నాన్ని చంపుకుని అడ్డమైన పనులు చేసిన తమ బాధను కూటమి ప్రభుత్వం అర్థం చే సుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయడం అభినందనీయమని పలువురు ఉపాధ్యాయలు పేర్కొంటున్నారు.



ప్రభుత్వ నిర్ణయం ఉపాధ్యాయులకు మేలు చేసేదిగా ఉంది



ఉపాధ్యాయులకు అనుకూలంగా సంతృప్తికరమైన ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం అమలు చేయడం హర్షణీయం. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

శిష్టా చలపతి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

అన్నవరం దేవస్థానంలో దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు

డిజిటల్ కార్డులు

రూ.లక్ష దాతలకు గోల్డ్, రూ.10లక్షలకు డైమండ్, ఆపై ప్లాటినం కార్డులు



దాత చక్కా తాతబాబుకు డోనార్‌కార్డు అందజేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 6: దేవాలయాలలో దాతలకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆలయాలలో అభివృద్ధి పనులు మరింతగా జరుగుతాయని ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం అనివేటి మండపంలో జరిగిన కార్యక్రమంలో తొలికార్డును తునికి చెందిన చక్కా తాతబాబుకు అందజేశారు. దేవస్థానంలో వివిధ పథకాలకు విరాళం అందించిన దాతల వివరాలను ఆన్‌లైన్ చేసి వారిచ్చిన విరాళాలను బట్టి కార్డులను జారీచేస్తారు. రూ.లక్ష విరాళమిచ్చిన వారికి గోల్డ్, రూ.10లక్షలు విరాళమిచ్చిన వారికి డైమండ్, రూ.10లక్షలు పైబడి విరాళమిచ్చేవారికి ప్లాటినం కార్డులు అందజేయనున్నారు. వీటిద్వారా భక్తులు ఏ కార్యాలయంను సంప్రదించకుండా నేరుగా వారికి కావాల్సిన సౌకర్యాలు అందజేస్తారు. గదుల కేటాయింపు, ప్రత్యేక దర్శనాలు, ఇతర సదుపాయాలు వీటిలో ఉంటాయి. దీంతోపాటుగా వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు వెల్లడించారు.

వజ్ర కిరీటం, వజ్ర కర్ణాభరణాలకు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ



సంప్రోక్షణ అనంతరం వజ్రకిరీటం, వజ్ర కర్ణాభరణాలు

ఇప్పటివరకు వజ్రకిరీటధారిగా భక్తులకు దర్శనమిస్తున్న సత్యదేవుడు, మంగళవా రం నుంచి దేవేరి అనంత లక్ష్మీ అమ్మవారు వజ్రకిరీటంలో దర్శనమిచ్చారు. సోమవారం దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు దేవస్థానం అధికారులకు వీటిని అందించిన సంగతి విదితమే మంగళవారం వేకువజామున వజ్రకిరీటం, వజ్రకర్ణాభరణాలకు శాస్త్రోక్తంగా దాత దంపతులచే పండితులు సంప్రోక్షణ, ఇతర పూజాదికాలు నిర్వహించారు. అనంత రం 7గంటలకు స్వామి,అమ్మవార్లను వజ్ర కిరీటం, వజ్రకర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లను నూతనంగా దర్శనమివ్వడంతో భక్తులు తన్మయత్వం చెందారు.

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు



అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ తన కుమార్తె వివాహం కారణంగా ఈనెల 20వ తేదీవరకు సెలవుపై వెళ్లనుండడంతో ఆయన స్థానం లో ఇన్‌చార్జి ఈవోగా అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డీఎల్‌వీ రమేష్‌బాబును నియమిస్తూ దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు 10సంవత్సరాలుగా అయన అన్నవరం దేవస్థానంలో సహాయ కమిషనర్‌గాను, ఏడాదిపాటు డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ పాలనాపరమైన వ్యవహారాల్లో ఆయనకు అనుభవం ఉండ డంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు అయన సేవలను గుర్తించి ఇన్‌చార్జి పదవి అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ సత్యదేవుడు తనకు ఇచ్చిన అవకాశాన్ని భక్తుల సౌకర్యాల కల్పనకు పాటుపడతానని రమేష్‌బాబు తెలిపారు.

నేటి నుంచి భీమేశ్వరస్వామివారి దర్శనం

- రెండో రోజు సంప్రోక్షణ కార్యక్రమాలు



గర్భాలయాల తాళాలు అందజేస్తున్న పురావస్తుశాఖ అధికారులు

ద్రాక్షారామ, ఆగస్టు 6: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివా, మాణిక్యాంబ అమ్మవార్ల మూలవిరాట్ల దర్శనానికి బుధ వారం ఉదయం 11 గంటల నుంచి అనుమతించనున్నారు. ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం సంప్రోక్షణ పూజలు ప్రారంభించారు. మంగళవారం రెండోరోజు కూడా సంప్రోక్షణ పూజలు కొనసాగాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కుచ్ఛ్ర యం, పునఃపూజలు, ఉదకశాంతి, శతరుద్రపారాయణ, శ్రీసూ క్త, దుర్గా సూక్తపారాయణ జరిగాయి. మధ్యాహ్నం శుక్ల యజుర్వేదపారాయణ, రుద్రహోమం, చండీ హోమం, నీరాజనమంత్రపుష్పాలు సమర్పణ నిర్వహించారు. ఆలయ వేదపండిత బృందం, అర్చకులు, స్వస్తివాచకులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలకు ఏర్పాట్లు

సామర్లకోట, ఆగస్టు 6: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారి మందిరం ఎదుట శ్రావణమాసం శుక్రవారాలలో భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నందున మహిళా భక్తులు అ పూజలలో పాల్గొనేందుకు ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో తమ గోత్ర, నామాలతో నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. మొదటి శుక్రవారం ఈనెల 9న, మూడవ శుక్రవారం 23న, నాల్గవ శుక్రవారం 30న మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా సామగ్రి, ప్రసాదాలు తదితర సామగ్రి పలువురు దాతల సౌజన్యంతో అందజేస్తామన్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలలో పాల్గొనే భక్తులతోపాటు వెంట వచ్చిన మరొకరికి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదాలు అందజేయనున్నట్లు పేర్కొంటూ మహిళా భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈవో నీలకంఠం తెలిపారు.



ఆలయ తూర్పురాజగోపురం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



పుష్పాలంకరణతో ఆకట్టుకున్న ప్రత్యేకవేదిక

వైభవంగా సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం

- ఘనంగా ఆయుష్య హోమం ● పోటెత్తిన భక్తులు

అన్నవరం, ఆగస్టు 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. వేకువజామున రెండు గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింప చేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మూలవరులకు దివ్యాభరణాలు, నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి, సర్వదర్శనాలను ఉదయం 7.30కు ప్రారంభించారు. 9గంటలకు ఆయుష్య హోమం ప్రారంభించి పండితులను ఈవో రామచంద్రమోహన్ సత్కరించారు. 11గంటలకు ఆయుష్యహోమ పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు కదంబం ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. తూర్పు రాజగోపురాన్ని పచ్చదనంతో నింపారు. అనివేటి మండపం వెలుపల ఏర్పాటుచేసిన స్వామివారి ఆవిర్భావ దినోత్సవ పుష్పాలంకరణ సూచిక విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఆ ప్రాంతంలో నిలబడి తమ కెమెరాలలో స్వీయచిత్రాలను బంధించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన నృత్యప్రదర్శన, కోలాటం ఆకట్టుకున్నాయి.

డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్..

కౌన్సిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): 2 డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, 5 అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్ర వరంలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో పని చేయవలసి ఉంటుందన్నారు. దరఖాస్తులు తూర్పుగోదావరిజిల్లా న్యాయస్థాన అధికారిక వెబ్‌సైటు, డీఎల్‌ఎస్‌ఏ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కి క్రిమినల్ న్యాయశాస్త్రంలో ఏడేళ్ల అనుభవం, సెషన్స్ కోర్టులో కనీసం 20 క్రిమినల్ ట్రయల్స్ చేయడంతో పాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉండాలన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కోసం క్రిమినల్ 'లా'లో 0-3ఏళ్ల అనుభవంతోపాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉండాలని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులు ఈనెల 9న సాయంత్రం 5గంటలలోపుగా తమ దరఖాస్తులను డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమాచారం https://east-godavari. dcourts. gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉందని పీడీజే తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా

- ముగ్గురు వ్యక్తుల అరెస్టు



అక్రమంగా ఆవులను తరలిస్తున్న దృశ్యం

వై.రామవరం, ఆగస్టు 6: అల్లూరి జిల్లా వై.రామవరం మండలం నుంచి ఆవులను అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. వీరిలో మామిడి పవన్‌కుమార్ (వ్యాన్‌డ్రైవర్), మేక శ్రీను, సాసుం రాఘవరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వ్యాన్ స్వాధీనం చేసుకుని ఆవులను, ఎద్దులను ఉలిగోగుల గోసంరక్షణ సమితికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బీచ్‌లో

రూ.9.63 లక్షల మద్యం ధ్వంసం

సర్పవరం, ఆగస్టు 6: సూర్యారావుపేట బీచ్‌లో రూ.9.63 లక్షల విలవచేసే 2170 లీటర్ల మద్యం బాటిల్స్‌ను కాకినాడ డీఎస్పీ, సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జేసీబీతో తొక్కించి పోలీసులు ధ్వంసం చేశారు. 261 కేసుల్లో ఈమద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని కాకినాడ డీఎస్పీ హనుమంతురావు తెలిపారు.

60వేల క్యూబిక్ మీటర్ల....

ఇసుక తరలింపు ఆవశ్యకతపై కలెక్టర్ దృష్టి

- రెవెన్యూ శాఖ సమాలోచనలు
- రంగంలోకి మైనింగ్ అధికారులు
- స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తారా??





కూనవరం మొగ వద్ద తవ్వుతున్న ఇసుకను గుట్టలుగా వేస్తున్న దృశ్యం, మొగ వద్ద ఇసుక గుట్టలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 6: కూనవరం సముద్రం మొగ వద్ద తవ్వకాల్లో ఇసుకను అక్కడే గుట్టలు వేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గుట్టలను తరలించాల్సిన ఆవశ్యకతను అధికారులు ముందుగానే గుర్తించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కూనవరం సముద్రం మొగ వద్ద గత మూడు రోజులుగా ముమ్మరంగా తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్విన ఇసుకను అక్కడే గుట్టలుగా వేస్తున్నారు. దీనివల్ల గాలులు, వర్షాలకు తవ్విన గండి తిరిగి మూసుకుపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను ముందుగానే డ్రెయిన్స్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. సర్వే ప్రకారం తవ్వకాల వల్ల దాదాపు 60వేల క్యూబిక్ మీటర్ల ఇసుక లభించే అవకాశమున్నట్టు అంచనా వేశారు. దీని వినియోగంపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో చర్చించినట్టు సమాచారం. అవసరాలకు ఇసుక మట్టి కావాలంటే ఎంతో వ్యయం చేయాల్సి రావడం, అవసరాలకు తగినంత ఇసుకమట్టి లభించకపోవడం తదితర అంశాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొగ వద్ద లభించిన ఇసుకను అక్కడి నుంచి తరలించడంవల్ల మొగ మూత పడకుండా రక్షణ లభించడంతోపాటు ప్రభుత్వ అవసరాలకు ఇసుకను వినియోగించుకోవచ్చని నిర్ధారణకు వచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఇసుక తరలింపు బాధ్యతను ఆర్డీవోకు అప్పగించినట్టు సమాచారం. మైనింగ్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక లభ్యత, ఎంత పరిమాణంలో మొగ ప్రదేశం నుంచి ఇసుక తరలించాలన్న అంశాలపై స్పష్టత తీసుకుని అనంతర చర్యలకు రెవెన్యూ యంత్రాంగం ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా అవసరమైన ప్రాంతాలకు ఇసుక తరలింపు లేదా అవసరమైనప్పుడు వినియోగించుకునేలా ప్రత్యేక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. మొగ వద్ద ఇసుక గుట్టల అంశంపై ఆందోళన చెందవద్దని డ్రెయిన్స్ అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు. మొగ తవ్వకాలు రైతులకు తక్షణం ఉపయోగపడేలా, ఎక్కువ కాలం మొగ మూతపడకుండా ఉండేలా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామని డ్రెయిన్స్ అధికారులు చెప్పారు.

రాఖీ అవెన్యూస్ పేరుతో

రూ.16 కోట్లు టోకరా

- బాధితుల ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో రాఖీ అవెన్యూస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ చంద్రిక అవంతిక ఫేజ్-2 పేరుతో ప్లాట్లు కట్టించి ఇస్తామని తమవద్ద నుంచి సుమారు రూ.16 కోట్లు పైబడి పెట్టుబడిగా డబ్బులు కట్టించుకుని మోసం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో బాధితులు ధవళేశ్వరానికి చెందిన మృత్యుంజయరావు, చెన్నైకి చెందిన శ్రావణి, భీమవరానికి చెందిన నటరాజ్‌లు మాట్లాడారు. రాఖీ అవెన్యూస్ పేరుతో మొదటి వెంచర్‌ను విజయవంతంగా ఆ సంస్థ నిర్వాహకుడు వేణురామయ్య పూర్తిచేయడంతో తమతో పాటు సుమారు 80మంది రూ.10 నుంచి 30 లక్షల వరకు రెండో వెంచర్‌కు డబ్బులు కట్టామన్నారు. లెక్కప్రకారం ఈ ప్లాట్లను నిర్మించి ఇచ్చేందుకు 30నెలలు సమయం పడుతుందని చెప్పారని కాని 25 నెలలు పూర్తయినా అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో గతంలో తామంతా వేణురామయ్యను కలిసి ప్రశ్నించామన్నారు. అతను ఈ ప్రాజెక్టు కొంత ఆలస్యమవుతుందని, అయినా పూర్తిచేసి ఇస్తానని చెప్పాడని తెలిపారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ తాము వెంచర్ వద్దకు, కార్యాలయం వద్దకు వెళితే రామయ్య కుమార్తె, అల్లుడు ఉన్నారని, వారు కూడా త్వరలో నిర్మాణాలు చేపడతామని చెప్పారని తెలిపారు. ఇలా నాలుగేళ్ల తర్వాత పరిస్థితిచూస్తే రామయ్య, అతని కుమార్తె, అల్లుడు ఎవ్వరూ కనిపించడం లేదన్నారు. దీంతో తాము మోసపోయినట్లు గ్రహించి 2023 అక్టోబరు 30న అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. కాని ఇంతవరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. సొంత ఇంటి కోసం రూ.10నుంచి రూ.30లక్షల వరకు బ్యాంకు రుణాలు తీసుకుని డబ్బులు కట్టామని, ఇప్పుడు ఇటు ఇల్లు లేక అటు నెలనెలా వాయిదాలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫేజ్-2 వెంచర్‌లో 130వరకు ప్లాట్‌లు నిర్మించాల్సి ఉందన్నారు. అమలాపురంలోను ఇదే తరహాలో మోసం చేశారని, ఇప్పుడు హైదరాబాద్‌లో మరో పేరుతో వెంచర్ ప్రారంభించినట్టు తెలిసిందన్నారు. చాలామంది ఉద్యోగులు, స్థానికేతరులు ఇక్కడ డబ్బులు కట్టి, ఇప్పుడు రిటైర్డ్ అయిపోయి కూడా బ్యాంకు రుణాలు కట్టుకుంటూ చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమలా మరొకరు మోసపోకూడదని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. తమ డబ్బులు ఇప్పించాలని కోరారు. సమావేశంలో మోహన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మరింత భద్రత



- సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి రక్షణకు నిర్ణయం
- తొలి దశలో 200 మెకనైజ్డ్ బోట్లకు ట్రాకింగ్ డివైజ్‌లు అమరిక
- రూ.40వేలు విలువైన ఒక్కో పరికరం పూర్తి సబ్సిడీతో అందజేత



ట్రాకింగ్ డివైజ్ పరికరం నమూనా

కాకినాడ సిటీ, ఆగస్టు 6: సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు ఉపయోగించే బోట్లకు ఇస్రో సాంకేతిక సహకారంతో శాటిలైట్ కమ్యూనికేషన్‌తో పాటు ట్రాకింగ్ డివైజ్ పరికరాలను అమర్చేందుకు జిల్లా మత్స్యశాఖ సన్నాహాలు చేస్తోంది. సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇందుకు మార్గనిర్దేశనం చేయడంతో పాటు వంద రోజుల ప్రోగ్రాం ప్రకటించారు. అందుకనుగుణంగా కాకినాడ జిల్లా పరిధిలోని మెకనైజ్డ్ బోట్లు (పెద్ద బోట్లు)కు ఈ పరికరాలు అమర్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు సర్వే చేయించారు. జిల్లావ్యాప్తంగా 395 మెకనైజ్డ్ బోట్లు ఉండగా తొలి దశలో 200 బోట్లకు ఈ పరికరాలు అమర్చనున్నారు. ఒక్కో ట్రాకింగ్ డివైజ్ పరికరానికి రూ.40వేలు ఖర్చు అవుతుండగా, నూరుశాతం సబ్సిడీతో ఉచితంగా అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ గ్రాంటును విడుదల చేయనున్నారు. మెకనైజ్డ్ బోట్లకు ట్రాకింగ్ డివైజ్ అమర్చడంవల్ల తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సముద్రంలో బోటు ఎక్కడ ఆగిపోయిందో, వేటకు వెళ్లిన మత్స్యకారులు ఎన్ని నాటికల్ మైళ్ల దూరంలో చిక్కుకున్నారో కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది. తద్వారా సహాయక చర్యలు చేపట్టి సముద్రంలో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించే వీలు కలుగుతుంది. ఆదేవిధంగా సముద్రంలో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు తీరం నుంచి ఎన్ని నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నారో, ఏ దిక్కున ప్రయాణిస్తున్నారో వంటి సమాచారం తెలుసుకో గలుగుతారు. సముద్రంలో బోటు ఆగిపోయి ప్రమాదంలో పడినప్పుడు సమీప బోట్ల మత్స్యకారులతో మాట్లాడి సహాయం పొందే వీలుంటుంది. దీనిపై మత్స్యశాఖ జిల్లా అభివృద్ధి అధికారి కరుణాకరరావును వివరాలు కోరగా.... బోట్లకు ట్రాకింగ్ డివైజ్ అమర్చేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. తొలి దశలో 200 మెకనైజ్డ్ బోట్లకు ఈ పరికరాలు అమరుస్తామని, రెండు నెలల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

తల్లి మందలించడంతో యువకుడి ఆత్మహత్య



వై.రామవరం, ఆగస్టు 6: సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని తల్లిమందలించడంతో మనస్తాపానికి గురైన ఓ గిరిజన యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన వై.రామవరం మండలం యర్రంరెడ్డిపాలెం పంచాయతీ గుండెంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 4వతేదీన సెల్‌ఫోన్ పోగొట్టుకున్న కుమారుడిని తల్లి మందలించడంతో నెరం సంతోష్‌కుమార్(18) అనే గిరిజన యువకుడు గడ్డిమందు తాగాడు. తొలుత అడ్డతీగల ప్రభుత్వాస్పత్రి కి అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి



మృతి చెందిన మోసం తమ్మయ్య

చింతూరు, ఆగస్టు 6 : పాము కాటుకు వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఏజీ కొడేరులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏజీ కొడేరుకు చెందిన మోసం తమ్మయ్య (76) తన నివాస గృహంవద్దనే పాము కాటువేసింది. దీంతో తమ్మయ్యను హుటాహుటిన చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగానే తమ్మయ్య మృతి చెందాడు.

బిడ్డ ప్రాణంకోసం నాటు మందు తీసుకున్నా

- వాగు పొంగడంతో నాటుమందే శరణ్యమని భావించాం
- చివరకు బిడ్డ ప్రాణాలు నిలబెట్టుకోలేకపోయాం ● ఓ తల్లి ఆవేదన



పాప తల్లిదండ్రులు మహేష్, రమ్య

చింతూరు, ఆగస్టు 6: జలుబు, దగ్గుతో బిడ్డ ఊపిరి పీల్చుకోలేని స్థితి. ఆసుపత్రికి వెళదామంటే ఎడతెరపిలేని వర్షం, వాగు పొంగి దారి కరువైంది. ఏం చేయాలో అర్థం కాలేదు. ఎలాగైనా బిడ్డ ప్రాణాలు నిలుపుకోవాలనుకున్నాం. గత్యంతరం లేక నాటుమందుని ఆశ్రయించాం. అయినా బిడ్డను కాపాడు కోలేక పోయాం. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు మండలం వంకగూడెంనకు చెందిన మహేష్, రమ్యల నాలుగు నెలల పసిబిడ్డ సోమవారం భద్రాచలంలో మృతి చెందిన విషయం విదితమే. మహేష్, రమ్యలు తెలిపిన వివరాల మేరకు .. ఈనెల ఒకటోతేదీ నుంచి తమ నాలుగు నెలల బిడ్డ దగ్గుతో బాధపడుతోంది. ఇక రాత్రి సమయంలో ఊపిరి పీల్చు కోలేనిస్థితి. ఆసుపత్రికి తీసుకెళ్దాం అనుకుంటే ఏడుగు రాళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాలి. ఎడతెరపిలేని వర్షం, వంక గూడెం నుంచి ఏడుగురాళ్లపల్లి వెళ్లాంటే మార్గమధ్యంలో ఉన్న వాగు దాటాల్సిందే. మరో మార్గమే లేదు. దీంతో ఆ ప్రయత్నం చేయలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాలేదు. బిడ్డ ఊపిరి పీల్చుకోవడంలో పడుతున్న అవస్థ పెరుగుతూపోతోంది. చేసేదేమీలేక నాటు వైద్యుడిని ఆశ్రయించాం. ఎలాగైనా బిడ్డను కాపాడుకోవాలనుకున్నాం. ఆ నాటు వైద్యుడు ఇచ్చిన పసర మందుని బిడ్డకు పట్టిచ్చాం. తల్లిపాల ద్వారా బిడ్డకు మందు అందుతుందన్న ఆశతో నేను (తల్లి రమ్య) కూడా నాటు మందు తీసుకున్నా. అయినా బిడ్డ పరిస్థితి మెరుగుప డలేదు. ఆదివారం రాత్రి వాగు ఉధృతి తగ్గడంతో కాలినడకన ఏడుగు రాళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాం. అక్కడి నుంచి వైద్యులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చింతూరు నుంచి భద్రాచలం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. చివరకు బిడ్డ ప్రాణాలు పోయాయంటూ ఆ తల్లిదండ్రులు రోధిస్తున్నారు.

చిన్నారుల మృతిపై నిర్లక్ష్యాన్ని గుర్తించాం

- బాధ్యులపై చర్యలు
- ఆర్‌ఎంపీలు స్థాయిని మించి వైద్యం చేయవద్దు
- నాటు మందు వినియోగంపై అవగాహన కల్పిస్తాం
- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు, ఆగస్టు 6: వరుసగా చిన్నారులు మృతి చెందు తున్న ఘటనలపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య స్పందించారు. వీటిలో రెండు ప్రదేశాలలో చోటుచేసుకున్న నిర్లక్ష్యాన్ని గుర్తించామన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోనున్నట్లు పీవో పేర్కొన్నారు. చింతూరు మండలంలో గడచిన ఎనిమిది రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలపై పీవో ఆరోగ్యశాఖతోపాటు రహస్యంగా మరో శాఖతో క్షేత్ర స్థాయి విచారణ చేయించారు. ఈ క్రమంలో మంగళవారం పీవో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించా రు. చిన్నారుల మృతికి కారణాలను తెలుసుకున్నామని ఐదు మరణాలలో రెండు మరణాలు నాటు మందు వాడడంవల్ల విషయం వెల్లడైందన్నారు. మరొక మరణం విషయంలో ఆర్ఎంపీ వైద్యుడి అరకొర వైద్యం కూడా కారణమే కావచ్చన్న నిర్ధారణకు వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు ప్రదేశాలలో చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరోగ్యశాఖకు చెందిన స్థానిక సిబ్బంది స్పందించకపోవడంతో సకాలంలో వారికి వైద్యం అందించే ప్రక్రియకు దూరం కావాల్సిన పరిస్థితిని గుర్తించా మన్నారు. దీంతో ఆ సిబ్బందిపై ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకోనున్నట్లు పీవో తెలిపారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా ఏఎన్ఎంల స్థానచలన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నామ న్నారు. వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందించే ప్రక్రియలో భాగంగా ఐటీడీఏలో టోల్‌ఫ్రీ నెంబరు కేటాయిస్తున్నామన్నారు. దోమతెరలు, ఫాగింగు తదితర పారిశుద్యం చర్యలు తీసుకుంటున్నామన్నారు. చింతూరు సీహెచ్‌సీకి రెడ్‌క్రాస్ నుంచి వెంటిలేటరు సదుపాయం ఉన్న అంబులెన్సును తీసుకువస్తామన్నారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ శాఖలతో కూడిన గ్రామసభలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహనతో ఆయా ప్రాంతాలలో తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా.కోటిరెడ్డి, చిన్నపిల్లల ప్రత్యేక నిపుణులు డాక్టర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారులకు మెరుగైన సదుపాయాలు'

కొత్తపల్లి ఆగస్టు 6: మత్స్యకారులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. మంగళవారం ఆయన మూలపేటలో పర్యటించి మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు వీలుగా రామాలయం నుంచి సముద్రం వరకూ రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించామని, మత్స్యకారులకు మల్టీపర్పస్ హాలు నిర్మిస్తామన్నారు. మేరుగు సూరిబాబు, కంబాల వెంకటరమణ, సూరాడ శ్రీనివాస్, సిద్దు నాగు ఉన్నారు.

ప్రతీ బుధవారం పొలంబడి నిర్వహించాలి : డీఏవో

సామర్లకోట, ఆగస్టు 6: స్వల్ప పెట్టుబడులతో, నాణ్యమైన అధిక వ్యవసాయోత్పత్తుల సాధన, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయాలను ప్రోత్సహించేందుకు అన్ని మండల వ్యవసాయాధికారులు ఆయా వీఏఏల పరిధిలో ప్రతీ బుధవారం పొలంబడి సదస్సులు నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ పేర్కొన్నారు. సామర్లకోట విత్తన అనుసరణీయ పరిశోధనా క్షేత్రం అతిథి గృహం ఆవరణలో జిల్లాస్థాయిలో మండల వ్యవసాయాధికారులు, ఎంపిక చేసిన వీఏఏలతో పొలంబడి మేలైన వ్యవసాయ పద్ధతులు, ఈ-పంట నమోదుపై మంగళవారం కాకినాడ వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్నప్రశాంతి అధ్యక్షతన నిర్వహించిన పునశ్చరణ తరగతుల్లో ముఖ్య అతిథిగా డీఏవో మాట్లాడారు. వరిపంటలో చీడపీడలు, వైరస్ తెగుళ్ళ వ్యాప్తి గుర్తించడం ఎలా అనే ప్రక్రియలపై క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో పిఠాపురం ఏడీఏ పి.స్వాతి, అన్ని మండలాల వ్యవసాయాధికారులున్నారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలి : కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6: తడి, పొడి చెత్తలను పారిశుధ్య సిబ్బందికి వేర్వేరుగా అందజేసి ప్రజలు సహకరించాలని కమిషనర్ భావన సూచించారు. అలా ఇవ్వని వారికి జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా మంగళవారం కమిషనర్ 12వ సర్కిల్ రామారావుపేట మూడులైట్ల కూడలి ప్రాంతంలో పర్యటించారు. ఓ అపార్టుమెంట్ నుంచి సేకరించిన చెత్తపై ఆరా తీశారు. తడి, పొడి చెత్త కలిసి ఉండడంతో అపార్టుమెంట్ నిర్వాహకులకు ఫైన్ విధించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లున్నారు.

హెచ్ఐవీ బాధితుల రక్షణకు ప్రత్యేక చట్టం : డీఐవో

కరప, ఆగస్టు 6: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందని, ఈ చట్టం ప్రకారం బాధితుల పట్ల వివక్ష చూపడం, వారి మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించడం నిషేధమని జిల్లా ఇన్‌చార్జ్ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రమావత్ శ్రీనివాసనాయక్ స్పష్టంచేశారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం భీమాభాయి మహిళామండలి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భీమాభాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ హెచ్ఐవీ చట్టాన్ని ఉల్లంఘిస్తే బాధ్యులపై రెండేళ్ల జైలుశిక్ష లేదా రూ.1లక్ష జరిమానా, లేదా రెండూ విధించబడతాయని తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది టి.బాలత్రిపురసుందరి, టి.రాజగోపాల్ పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 6: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం కోరారు. ప్రత్తిపాడు ట్రెజరీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన మండల పెన్షనర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఆర్,ఏరియర్స్ మంజూరు చేయాలన్నారు. సమావేశంలో మండల జిల్లా సంఘ కోశాధికారి సీవీరమణ, మండల సంఘ ఉపాధ్యక్షుడు వైవీ రాము, సీనియర్ విశ్రాంత ఉద్యోగులు బర్రే కోటేశ్వరరావు, ఎ.శేషగిరిరావు, ఎస్.అప్పారావు, వి.సత్యనారాయణ, జంధ్య సుబ్బారావు, వి.వీరభద్రరావు, టి.సీతారాం, పెంటమ్మ, ఎం.సుబ్రహ్మణ్యం, ఆదిరాజు, సత్యవతి, సూర్యనారాయణమూర్తి ఉన్నారు.

'హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి'

జేఎన్టీయూకే, ఆగస్టు 6: ప్రస్తుత తరుణంలో యువత ఆధునికంగా కనిపించేందుకు హెల్మెట్ ధరించట్లేదని, భద్రతకు ప్రాముఖ్యమిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని కాకినాడ 5వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షిరీన్ కోరారు. జేఎన్టీయూకేలోని యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, యూసీఈకే ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ వాడకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా షేక్ షిరీన్, గౌరవ అతిథులుగా వైస్ ప్రిన్సిపాల్స్ రత్నకుమారి, మీరాసాహెబ్, కాకినాడ ఆర్టీవో బి.మురళీకృష్ణ, ట్రాఫిక్-1 సీఐ రమేష్ హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రమణాజీ, కిరణ్మయి ఉన్నారు.

'ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలి'

ఏలేశ్వరం, ఆగస్టు 6: నూతనంగా నిర్మించుకునే ఇళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ బుజ్జి అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ డ్వాక్రా పొదుపు సంఘాలలో లబ్ధిదారులుకు రూ.50వేల వరకూ ఇళ్ల నిర్మాణానికి రుణాలు పొందవచ్చని ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతీ రైతు ఈక్రాఫ్ ద్వారా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ గుప్తా, డీఈ ఎల్.శ్రీనివాస్, జ్యోతుల పెదబాబు, పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందేవరకూ పోరాటం'

పిఠాపురం, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలు, ఉపకులాలు అందరికీ అందేవరకూ పోరాటం సాగిద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ తదితరులు సూచించారు. పిఠాపురం ఇందిరానగర్‌లో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణ అధ్యక్షుడిగా గొడిచెర్ల చినబాలరాజు, ఉపాధ్యక్షుడిగా పెద్దాడ అప్పారావు, కార్యదర్శిగా సిర్రా లోవరాజు, పెదపాటి వెంకటరమణ, శ్రీను తదితరులు ఎన్నికయ్యారు.

'జనసేన సభ్యత్వాలకు అపూర్వ స్పందన'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 6: జనసేన సభ్యత్వాలకు అన్నివర్గాల ప్రజలు నుంచి అపూర్వ స్పందన లభించిందని జనసేన పార్టీ పిఠాపురం నియోజవకర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోనే అత్యధికంగా 2,500 జనసేన సభ్యత్వాలు చేయించిన ఓదూరి కిషోర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

'రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి'

ఏలేశ్వరం, ఆగస్టు 6: పట్టణంలో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టెం వెంకట రమణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వాడపల్లి చిన్న, విజయ్ కుమార్‌లు కమిషనర్ శివప్రసాద్‌కి వినతి అందజేశారు. నగర పంచాయితీ పరిధిలో 5, 18 వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

దివ్యాంగుల ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరం

తునిరూరల్, ఆగస్టు 6: తుని మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగుల ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో అల్మ్కో సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు హాజరై వివరాలు నమోదు చేసుకున్నారు. తుని పట్టణం నుంచి 160 మంది, మండలం నుంచి 121, కోటనందూరు మండలం నుంచి 40, తొండంగి మండలం నుంచి 19 మంది మొత్తం 340 మంది రిజిస్ట్రేషన్లు దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కమిషనర్ వెంకట్రావు పేర్కొన్నారు.

లభించని ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆచూకీ

తొండంగి, ఆగస్టు 6: అదృశ్యమైన జీఎంపేట ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాకా లలిత ఆచూకీ ఇంకా లభించలేదు. ఈ నెల 3న డ్యూటీ ముగించుకుని ఇంటికి బయలు దేరిన ఆమె ఇంటికి చేరలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు తొండంగి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఉప్పాడలో వేరే ఆటో ఎక్కి కాకినాడ వెళ్లినట్టు గుర్తించి అక్కడ విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం కాకినాడ తీరంలో వేరే ఎవరిదో మృతదేహం లభించగా అది లలితదే నంటూ సోషల్ మీడియాలో వైరల్ కాగా తొండంగి పోలీసులు దీనిని ఖండించి ఇంకా ఆమె ఆచూకీ లభించలేదని తెలిపారు. ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపినవారికి జైలు

కాకినాడ క్రైం, ఆగస్టు 6: మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష, మరో ముగ్గురికి జరిమానా విధిస్తూ కాకినాడ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హోతా వీరభద్రుడు మంగళవారం తీర్పు చెప్పారు. ఈనెల 5న కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ వి.సురేష్‌బాబు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మోతాదుకు మించి మద్యం తాగినట్టు గుర్తించినవారిని కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. జరిమాని చెల్లించలేని మరో ఐదుగురికి ఒక్కొక్కరికి 2రోజులు చెప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, ఆగస్టు 6: మండలంలో మల్లేపల్లి జాతీయరహదారి పక్కన అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం గ్రామస్తుల సహకారంతో కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. దార్లంక శ్రీనివాసరావు, తెమ్మనబోయిన జయ, వల్లభశెట్టి వంశీ, పిల్లా సత్యనారాయణ, జాజిమొగ్గల సత్యనారాయణ ఉన్నారు.

ఎంఈవో పరిశీలన

సామర్లకోట, ఆగస్టు 6: సామర్లకోట మండల ఎంఈవో వై.శివరామకృష్ణయ్య పట్టణ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీబీఎం పాఠశాలలో అమలవుతున్న విద్యాప్రవేశ కార్యక్రమాలు అమలును మంగళవారం పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. హెచ్ఎం ప్రసన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ మల్లవరంలో డీఎమ్‌హెచ్‌వో పర్యటన

» ఇంటింటా సర్వే

» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



ఏపీమల్లవరంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 6: గొల్లప్రోలు మండలం ఏపీమల్లవరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ బుధవారం పర్యటించారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయని, పలువురు అస్వస్థతకు గురయ్యారని, ప్రవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూతో చికిత్స పొందుతున్నారని ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీని పై జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఎమ్‌హెచ్‌వో గ్రామంలో పర్యటించి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే జరిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. శిబిరాలు నిర్వహించకపోవడంతో జ్వర బాధితులు ప్రవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తున్నదని టీడీపీ నేత చిన భాస్కరరెడ్డి డీఎమ్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. బుధవారం నుంచే ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామని, అవసరమైన వారికి ఇక్కడే చికిత్స చేస్తారని డీఎమ్‌హెచ్‌వో తెలిపారు. 51 ఓపీ కేసులు నమోదు కాగా 11మందికి రక్తపరీక్షలు చేశారు. కాగా ప్రవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూతో చికిత్స పొందుతున్న వారి గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. వైద్యశిబిరంలో ఏపీనగరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతిలు వైద్యపరీక్షలు నిర్వహించగా శిబిరాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ భారతి, గొల్లప్రోలు ఎంపీడీవో జయప్రకాష్, ఈవోపీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజు సందర్శించారు.

శిథిల భవనాల స్థానంలో నూతన బ్లాక్‌ల నిర్మాణం

సిటీ ఎమ్మెల్యే కొండబాబు



అధికారులతో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 6: శిథిలస్థితికి చేరుకున్న కళాశాలలోని భవనాల స్థానంలో నూతన బ్లాక్‌లు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. జగన్నాథపురంలోని ఏఎస్‌డీ మహిళా కళాశాలలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై మంగళవారం ఆయన కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, అధ్యాపక సిబ్బందితో కలిసి పరిశీలించారు. కొండబాబు మాట్లాడుతూ రూ.47 లక్షలతో సెమినార్ హాల్ నిర్మించనున్నామని, శిథిలస్థితికి చేరుకున్న భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మిస్తామని చెప్పారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు బచ్చు శేఖర్, చింతలపూడి రవి పాల్గొన్నారు.

మైనింగ్‌కు పాల్పడితే చర్యలు



రిజర్వ్ ఫారెస్ట్ హద్దులు పరిశీలిస్తున్న రేంజర్

ప్రత్తిపాడు, ఆగస్టు 6: ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీలో రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ కె.దుర్గాంప్రసాద్ హెచ్చరించారు. ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు మైనింగ్ ఏరియాలోని తోటపల్లి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో మైనింగ్ ఏమైనా జరిగాయా అని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తోటపల్లిరిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరగలేదని తెలిపారు. ఈ అటవీ ప్రాంతంలో మైనింగ్ అనుమతులకు లేవని, అక్రమ మైనింగ్‌లకు దిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఏలేశ్వరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జి.నాగేశ్వరరావు, శంకవరం ఫారెస్ట్ బీట్ అధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నికలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, ఆగస్టు 6: ఈ నెల 8న జరగనున్న విద్యాకమిటీ ఎన్నికలపై జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తమ్ములపల్లి రమేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాకమిటీ ఎన్నికల్లో జనసేన నాయకులందరూ భాగస్వాములు కావాలని, ప్రతి గ్రామం నుంచి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల గెలుపుతో పాఠశాలలను అభివృద్ధి పరిచే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని 4మండలాల జనసైనికులు హాజరయ్యారు.

పిఠాపురంలో...

పిఠాపురం, ఆగస్టు 6: పాఠశాలల విద్యాకమిటీల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూటమి నేతలు బుధవారం సమావేశమయ్యారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమావేశమై విద్యాకమిటీ ఎన్నికల్లో సేవాభావంతో పాఠశాలల అభివృద్ధికి పనిచేసే తల్లిదండ్రులు ఎన్నికయ్యేలా చూడాలని నిర్ణయించారు. పట్టణంలో ఆరు ఉన్నత పాఠశాలలు, 22 ప్రామిక పాఠశాలల విద్యాకమిటీ(పాఠశాల మేనేజ్‌మెంట్)ల ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, సభ్య పదవులకు జరిగే ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో వ్యవహరించాలని తీర్మానించారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులున్నారు.

రైతుకూలీ సంఘం నిరసన

జగ్గంపేట, ఆగస్టు 6: జగ్గంపేటలో సుమారు 2వేల మందికి పైగా ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఇచ్చినా జగనన్న కాలనీకి వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ తక్షణం కలెక్టర్ స్పందించి జగనన్న కాలనీ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి కె. సతీష్, జిల్లా నాయకులు దేశెట్టి సురేష్, రామలింగేశ్వరరావు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

యువతను సన్మార్గం వైపు నడిపించాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



సర్పవరం: పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పాల్గొన్న నాయకులు

సర్పవరం, ఆగస్టు 6: సమాజాన్ని చైతన్యపరిచే రచనల అవసరాన్ని రచయితలు గుర్తించి యువతను సన్మార్గం వైపు నడిపించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో మంగళవారం హెల్త్ అవేర్ అసోషియేషన్ 23వ వార్షికోత్సవం సందర్భంగా తణుకు రచయిత కానూరి బదరీనాథ్ రచించిన భారత స్వాతంత్ర్య సమర చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల ముఖ్య ఘటాలను పుస్తక రూపంలో ఆవిష్కరించిన రచయిత బదరీనాథ్ అభినందనీయుడని కొనియాడారు. హెల్త్ అవేర్ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల చరిత్రను నేటి తరానికి అందించే ప్రయత్నం చేసిన బదరీనాథ్‌ను అందరూ ప్రోత్సహించాలన్నారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావుకు అంకితమిస్తున్నట్టు రచయిత బదరీనాథ్ తెలిపారు. ఎమ్మెల్యే నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కొప్పార్తి మునిరెడ్డి, గవర్నర్ వనుం శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రప్రసాద్, డాక్టర్ రంకిరెడ్డి రామమోహనరావు, పోపూరి దక్షిణామూర్తి, కాకిలేటి రాజేంద్ర, యర్రమిల్లి విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేశారు. డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత నులుకుర్తి వెంకటేశ్వరరావు, గ్రీన్‌ఫీల్డ్ స్కూల్స్ ఛైర్మన్ గ్రంధి బాబ్జి, గోపాల్ ఆర్.సూరాబత్తుల, చల్ల శ్రీనివాసనిరంజన్, మెగా లెజెండ్స్ గ్రూప్ సెక్రటరీ మంజుల, లలిత, జనసేన నాయకురాలు అనసూరి రాజకుమారి పాల్గొన్నారు.

కార్యకర్తల రుణం తీర్చుకుంటా

కరప, ఆగస్టు 6: కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి రికార్డుస్థాయి మెజార్టీతో తనను గెలిపించిన ఓటర్లందరికీ కృతజ్ఞతలని, తన గెలుపుకు అహర్నిశలు కృషిచేసిన కార్యకర్తల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. నడకుదురు వెలమ కళ్యాణమండపంలో సోమవారం రాత్రి మండలంలోని 23 గ్రామాల జనసేనపార్టీ గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రసంగించారు. పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు ఎమ్మెల్యే, టీడీపీ నేత కటకంశెట్టి ప్రభాకర్‌లను గజమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, సీనియర్ నేత బోగిరెడ్డి కొండలరావు(కొండబాబు), వెలుగుబంట్ల శ్రీనివాస్‌ను సత్కరించి మెమెంటోలను అందజేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

తల్లి పాలు ముద్దు..డబ్బా పాలు వద్దు

సీడీపీవో లక్ష్మి



కాకినాడ రూరల్: సామూహిక సీమంతాలు

కాకినాడ రూరల్, ఆగస్టు 6: తల్లి పాలు ముద్దు.. డబ్బా పాలు వద్దని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వై.లక్ష్మి సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలోని పంచాయితీ కార్యాలయం వద్ద గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారాన్ని, చీరలు, జాకెట్లు, పూలు, గాజులు, పసుపు, కుంకుమ తదితర సామగ్రిని సర్పంచ్ కోటిపల్లి ఉమాసతీష్ చేతులమీదుగా అందజేశారు. అనంతరం మహిళలు, బాలల చట్టాలపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ లాయర్ నాగలక్ష్మి పాల్గొని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రకాష్‌గౌడ్, కోటిపల్లి శ్రీను, సానాశ్రీను, మాదాల రమణ,ర్యాలీ సతీష్, కమ్మశ్రీను, త్రినాథ్, నాని, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, డీసీపీవో వెంకట్,సూపర్‌వైజర్ పద్మశ్రీ, ఐసీపీఎస్ దుర్గాభవానీ ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

కాకినాడ సిటీ: 29వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కొండమ్మ సందులో చంటి పిల్లల తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ప్రభావతి, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి అమలకంటి బలరామ్, మాజీ కార్పొరేటర్ సిరియాల లక్ష్మి, హెచ్‌వో అరుణ, ఏఎన్ఎం ఎస్.విజయకుమారి, పద్మజ ఉన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లు గ్రామం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వీరవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్ బూసమ్మ అధ్యక్షతన జగ్గంపేట సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ జ్యోతుల రాంబాబు మాట్లాడారు. అనంతరం పి.చంద్రశేఖరావు చీరలు, పూలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో దొడ్డ అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పి శాంతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 6: గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో తాగునీటి సమస్య, ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందకపోవడంపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ కృష్ణతేజ పర్యటించి పరిశీలన జరిపారు. తాగునీరు పూర్తిస్థాయిలో ఎలా అందించగలమో పరిశీలన చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్ఈ 2 గ్రామాల్లో పర్యటించి ప్రస్తుతం ఉన్న ఓవర్ హెడ్ రిజర్వాయర్లు, వాటికి నీరు ఎలా అందుతోంది, నీటిసరఫరా ఎలా మెరుగుపరచవచ్చు తదితర అంశాలను ఎస్ఈ పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ భారతి, డీఈఈ శ్రీదేవి తదితరులున్నారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

పెద్దాపురం, ఆగస్టు 6: పెద్దాపురం ఎస్ఐగా వి.మౌనిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె డీఎస్పీ లతాకుమారిని మర్యాదపూర్వంగా కలిశారు. అలాగే పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియచేశారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ఎస్ఐగా సతీష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐకు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



పిఠాపురంలో కురుస్తున్న వర్షం

పిఠాపురంలో భారీ వర్షం

పిఠాపురం, ఆగస్టు 6: పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ విడతల వారీగా కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది. రోజంతా ఆకాశం మేఘావృతమయి ఉంది. పంటపొలాల్లో పలుచోట్ల భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది.

కాకినాడలో వర్షం..

కాకినాడ సిటీ, ఆగస్టు 6: నగరంలో మోస్తరుగా వర్షం కురిసింది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కాకినాడలో పలుచోట్ల వర్షం పడింది. వాతావరణం చల్లబడి ప్రజలు సేదతీరారు. జిల్లాలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, శంఖవరం పెద్దాపురం మండలాల్లో అధికంగానే వర్షం పడింది.

ఉధృతంగానే సుద్దగడ్డ వరద

గొల్లప్రోలు, ఆగస్టు 6: సుద్దగడ్డ వరద ఉధృతంగానే ఉంది. ఎగువ ప్రాంతాల్లో, స్థానికంగా కురిసిన వర్షాలతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ)కాలువలో వరద నీరు నిండుగా ప్రవహిస్తున్నది. పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై నాలుగు అడుగల ఎత్తులో వరద నీరు ఉంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తున్నది. మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురవడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సత్యదేవుడికి రాజప్ప పూజలు



ఎమ్మెల్యే రాజప్పకు ప్రసాదం అందజేస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందచేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. పీఆర్వో కృష్ణారావు,ఏపీఆర్వో ఎం.గణపతి పాల్గొన్నారు.

ఇత్తడి గరుడ వాహనం బహూకరణ



దాతలు బహూకరించిన ఇత్తడి గరుడ వాహనం

పిఠాపురం, ఆగస్టు 6: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి దాతలు ఇత్తడి గరుడ వాహనం బహూకరించారు. పట్టణానికి చెందిన లోకారెడ్డి బుచ్చిరామన్నదొర కుటుంబసభ్యులు, కేదారిశెట్టి వెంకట నాగ సూర్య గంగాధర్, రామారావు, చంద్రకన్య దంపతుల సహకారంతో ఈ వాహనాన్ని తయారు చేయించి మంగళవారం ఆలయ ప్రాంగణంలో అర్చకుడు విజయజనార్ధనాచార్యులకు అందజేశారు. సంప్రోక్షణ అనంతరం వాహనాన్ని స్వామిసేవకు వినియోగిస్తామని ఆలయ ఈవో నున్న శ్రీరాములు తెలిపారు.

ఫిజియోథెరపీ కేంద్రం పరిశీలన

పెద్దాపురం, ఆగస్టు 6: స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలో ఉన్న ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఎంఈవో వీఆర్కే చౌదరి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు సేవలు ఏవిధంగా అందుతున్నాయో నిర్వాహకుడు బి.దుర్గాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిల్లంకలో ఏపీడీ విచారణ

తాళ్లరేవు, ఆగస్టు 6: పిల్లంక పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డు అసిస్టెంట్‌పై కొత్తలంక గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై మంగళవారం పిల్లంక పంచాయతీలో ఏపీడీ వసంతమాధవి విచారణ చేపట్టారు. ఫీల్డు అసిస్టెంట్ లంక సత్యం గత ఐదేళ్లుగా ఉపాధి పనులు సక్రమంగా చెప్పడంలేదని సామాజిక తనిఖీలో పాము హరికృష్ణ, గెడ్డం ఏడుకొండ పీడీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీవో తేజస్విని, టీఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు వలీబాబు,శివప్రసాద్‌లున్నారు.

ఉచిత వైద్యశిబిరం

జగ్గంపేట, ఆగస్టు 6: జగ్గంపేట మండలం కృష్ణాపురంలో బేతేలు ప్రార్థనా మందిరం అధ్యక్షుడు వెలిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో సూర్యగ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 150 మంది పేదవారికి ఉచిత వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సూర్యగ్లోబల్ ఆసుపత్రి ఆఫీసర్ కె.తిరుపతిరావు, ఎముకల నిపుణులు తరుణ్, గుండె నిపుణులు శ్రీనివాస్, వైద్యబృందం, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆఫ్ జగ్గంపేట అధ్యక్షులు వెలిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

కాకినాడ సిటీ, ఆగస్టు 6: కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఇట్ల కిషోర్ మంగళవారం తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులకు సంబంధించి భద్రతా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి అగ్నిమాపక నిరోధక పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డిప్యూటీ తహశీల్దార్ పవన్, ఆనంద్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి మైక్‌సెట్ అందజేత

పెద్దాపురం, ఆగస్టు 6: స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయానికి విశ్రాంత హిందీ అధ్యాపకుడు అల్లంరాజు శివరామకృష్ణ మైక్‌సెట్ తదితర ఉపకరణాలను అందజేశారని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, పాఠకులు ఉన్నారు.

బ్యాగ్స్, బుక్స్ అందజేత

శంఖవరం, ఆగస్టు 6: కొత్తూరులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీడీపీ నాయకులు బ్యాగ్స్, బుక్స్ బుట్లు అందజేశారు. కర్రి గణేష్, గొర్లి నాగరాజు, మందపల్లి కృష్ణ, ముప్పిన రమణ, సింహాద్రి కుమార్, ఈ.కృష్ణ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

రౌతులపూడి, ఆగస్టు 6: రౌతులపూడి గ్రామశివారు ఏలేరు కాలువ వద్ద ఆటోలో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు పట్టుకున్నారు. 31టీజీ 169 నెంబర్ గల ఆటోలో గిడజాం గ్రామానికి చెందిన తుంపాల సూరిప్రకాశ్ తరలిస్తుండగా పట్టుకుని ఆటో స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

చికిత్సపొందుతూ

వ్యక్తి మృతి

గండేపల్లి, ఆగస్టు 6: పెదపూడి మండలం జి.మామిడాడకు చెందిన కొత్తల శ్రీను(48) సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో వడ్రంగి పనిచేస్తున్నాడు. ఈనెల 5న రాత్రి కాలేజీ నుంచి బయటకు వస్తుండగా లారీ ఢీకొట్టడంతో శ్రీను తీవ్ర గాయాలపాలయ్యాడు. కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. అతడి కుమార్తె అలుగోలు మాలతి ఫిర్యాదుతో గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.